16.

# నిత్యానిత్య విచారణ ఆవశ్యకం

త్యజ దుర్జన సంసర్గం భజ సాధుసమాగమమ్
కురు పుణ్యమహోరాత్రం స్మర నిత్యమనిత్యతాం.

ప్రేమస్వరూపులారా!

దుర్జన సాంగత్యమునుండి మనము దూరము కావాలి. మొదలు 'భజ సాధు సమాగమం' మంచి వారితో చెలిమిని చెయ్యాలి. 'పుణ్యం అహోరాత్రం కురు' నిరంతరం కూడను పుణ్య కార్యములు మనము ఆచరించాలి. 'స్మర నిత్యం అనిత్యతాం' ఏది నిత్యం? ఏది అనిత్యం? ఏది సత్యం? ఏది అసత్యం? అనేటువంటి విచారణ చేసి మనము ఏ కార్యమునందైన కూడను ప్రవేశించాలి.

ఈనాటి మానవుడు ప్రపంచమునందు గల సమస్త విషయములను కూడను తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఏ దేశమునందు ఏ స్థలమునందు ఏమి జరుగుచున్నది అనేటువంటి విషయాన్ని గాఢంగా విచారిస్తూ ఉన్నాడు. కానీ దురదృష్టవశాత్తు ప్రతి మానవుడు ప్రపంచాన్ని గురించి విచారిస్తున్నాడే కాని తానెవరో? అనేటువంటి తన తత్వాన్ని విచారించుటకు వెనుకంజ వేస్తున్నాడు. తానెవరో తెలుసుకొనక ప్రపంచాన్ని తెలుసుకొని ప్రయోజనమేమిటి? ఈ ప్రపంచమంతయును 'తాను' అనేదానిపైన ఆధారపడి ఉంటున్నది. కూటిపేద కానీ, కోటీశ్వరుడు కానీ మొట్టమొదట తనను తాను పరిచయము చేసుకునే పూర్వము 'నేను, నేను' అనేటువంటి పదాన్ని ఉపయోగిస్తాడు.

**నేనంటే ఎవరు?**

ఈ 'నేను' అనేటువంటిది ఎవరు? మీరెవరండి? అంటే 'నేను'. మరొక పర్యాయము మీరెవరండీ? అంటే 'నేనొక డాక్టరు? మరొక పర్యాయము మీరెవరండి? అంటే 'నేను వ్యాపారస్తుడను' అంటారు. 'వ్యాపారము' చేసేది ఎవరు? 'వ్యాపారము' ఒక వృత్తి. 'డాక్టరు'

srisathyasaivachanamrutam

ఒక పని. కానీ పని సంగతి నీవు చెప్పుతున్నావు కానీ నీవెవరు మొట్టమొదట? నా పేరు రామయ్య. నా పేరు కృష్ణయ్య. ఈ కృష్ణయ్య, రామయ్య దేహములకు పెట్టిన పేర్లు కానీ, నీవు కాదే! కనుక ఈ విధముగా విచారణ చేస్తూ పోతే వస్తువుల పేర్లు, దేశముల పేర్లు, వృత్తుల పేర్లను వర్ణిస్తున్నాయి కానీ, తానెవరో అనేటువంటి సత్యాన్ని మానవుడు గుర్తించడానికి ప్రయత్నించటం లేదు. సరియైన జవాబు. నా పేరు ఆత్మ. ఈ రూపనామములు కూడను క్షణములో మారిపోతుంటాయి. ఇవి స్థిరమైనటువంటివి కాదు. ఇవన్నీ అస్థిరమైనటువంటివి. కానీ తాను స్థిరమైనటువంటి వాడు. ఇలాంటి నిత్యసత్యమైనటువంటి తత్త్వాన్ని గుర్తించక అనిత్యము, అశాశ్వతము, అసత్యమైనటువంటి విషయాలను మానవుడు అనేక విధములుగా గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇలాంటి మానవులవల్ల జగత్తుకు కలిగేటువంటి ఉపయోగమేమిటి? ఇలాంటి మానవులే స్వార్థ, స్వప్రయోజనములలో మునిగి దేశముయొక్క క్షేమమును కానీ, సమాజముయొక్క సౌభాగ్యమును కానీ, ఏమాత్రమూ గుర్తించుకోలేక పోతున్నారు. ఈ వ్యక్తులందరూ కూడను సమాజంలో ఒక మెంబర్సే కానీ తాను ప్రత్యేకం కాదు. సమాజ క్షేమాన్ని గుర్తించినటువంటివాడే తన క్షేమాన్ని తాను గుర్తించడానికి వీలవుతుంది. వ్యక్తి, కుటుంబము ఇవన్నీ దేనిపైన ఆధారపడి ఉంటున్నవి? ఇట్టి సమాజముయొక్క క్షేమాన్ని గుర్తించక, తన స్వార్థాన్ని మాత్రమే లక్ష్యమునందుంచుకొని జీవించడానికి ప్రయత్నిస్తున్నాడు మానవుడు. ఆత్మవిశ్వాసాన్ని విస్మరిస్తున్నాడు. ఏ మానవుడు ఏ చిన్న గృహమును నిర్మించవలెనన్నను మొట్టమొదట పునాది భద్రంగా వెయ్యాలి. పునాదియే లేకుండిన భవనమే నిలువజాలదు. కనుక ఈ పునాదియే ఆత్మవిశ్వాసము. ఆత్మవిశ్వాసము గట్టిగా ఉన్నప్పుడే తన జీవితమనే భవనము సుభద్రంగా ఉంటుంది. ఈ పునాది దేనికోసం? గోడలు కట్టే నిమిత్తమై పునాదులు అత్యవసరము. ఈ గోడలు ఏమిటి? ఎప్పుడు ఆత్మవిశ్వాసము తనయందు ఆవిర్భవించునో అప్పుడే ఆత్మ అనేటువంటియొక్క విశ్వాసము చేత తన ఆత్మతృప్తి కలుగుతుంది. ఈ ఆత్మతృప్తి ఆత్మవిశ్వాసము వల్లనే లభ్యమవుతుంది. ఈ ఆత్మతృప్తి దేనివల్ల అభివృద్ధి అవుతుంది? స్వార్థత్యాగము చేతనే స్వార్థమనేటువంటిది నిలిచిపోతుంది. ఈ స్వార్థత్యాగము చేతనే మానవత్వములో ఆత్మశాంతి కలుగుతుంది.

sri sathyasai vahini amrutam

అప్పుడే ఆత్మతృప్తి మనకు అర్థమవుతుంది. కానీ ఈనాటి మానవుడు పునాదియైనటువంటి ఆత్మవిశ్వాసమునే విస్మరించినప్పుడు ఇంక ఆత్మశాంతి ఏ రీతిగ లభ్యమవుతుంది? ఆత్మతృప్తి ఏ రీతిగా లభిస్తుంది? ఆత్మానందము ఏ రీతిగా తాను అనుభవించగలడు? కనుక ఈనాటి మానవుడు ఆత్మను విస్మరించి, దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియము, అంతఃకరణ దీనిపైన మాత్రమే ఆధారపడి ఉంటున్నాడు. కానీ వీటన్నిటికినీ ఒక మాష్టరు ఉన్నాడు. అదియే ఆత్మ. కనుకనే 'Master the mind - Be a Mastermind'

**దేహము-ఇంద్రియాలు-మనస్సు-బుద్ధి అన్నీ పనిముట్లే**

ఈ మనస్సు, దేహము, బుద్ధి, చిత్తము, ఇంద్రియము ఇవన్నీ కూడను కేవలము ఒక విధమైనటువంటి పనిముటుల్లు. దేహములో ఈ ఆత్మ అనే vibration ఉండటం చేతనే ఈ దేహము, మనస్సు, బుద్ధి అన్నీ పని చేస్తున్నాయి. కానీ ఈ సత్యాన్ని మానవుడు ఏమాత్రము గుర్తించడానికి ప్రయత్నించటం లేదు. దైవత్వమునే విస్మరించినటువంటి వానికి ఏ సుఖము, శాంతి లభించదు. ఏదో ఆనందముగా ఉండినట్లు నటిస్తున్నారు కానీ, ఆనందము ఏమాత్రము ఉండదు. ఆనందమునకు మాష్టరు భగవంతుడే. శాంతికి యజమాని భగవంతుడే. ఎందుకోసం భగవంతుని ప్రార్థిస్తున్నాము? నేను ఫలాని పనికోసమని, ఫలాని ఫలితము కోసమని ప్రార్థిస్తున్నామని భావిస్తున్నారు. ఇది చాలా చెడ్డ భావము. భగవంతుడిని ప్రార్థించేటువంటిది ప్రాపంచిక సంబంధమైనటువంటి వృత్తులకోసమని, కానీ ఫలితము కోసము కాదు. తన దగ్గర ఏది లేదో, భగవంతుని దగ్గర ఏది ఉన్నదో దానిని పొందే నిమిత్తమై ప్రార్థిస్తున్నాడు. తన దగ్గర లేనిది శాంతి. అట్టి శాంతి స్వరూపుడైనటువంటి భగవంతుడిని ప్రార్థించి శాంతి తననుంచి పొందడానికోసం, తనయందు లేనటువంటిది ఆనందము, అట్టి ఆనందాన్ని భగవంతుని దగ్గరనుంచి పొందగోరి ప్రార్థిస్తున్నారు. ఎన్ని పూజలు, ఎన్ని తపములు, ఎన్ని యజ్ఞములు, ఎన్ని యాగములు, ఎన్ని యాత్రలు చేసినప్పటికిని ప్రాపంచిక సంబంధమైనటువంటి విషయవాంఛ కోసం కాదు. కానీ ప్రపంచములో దొరకనిది, కేవలం భగవంతుని నుంచి లభ్యమయ్యేటువంటి దానికోసం మనం ప్రార్థిస్తున్నాము. ఈ సత్యాన్ని ఏ మానవుడు కూడను విచారం చేయటము లేదు. ఏదో దీనిని కోరినాము, భగవంతుడు ఇవ్వలేదు,

sri sathyasai vahanamrutam

అయిపోయిందని భగవంతుని ఫోటో తిప్పి పెట్టేస్తారు. ఇలాంటి భక్తులు భక్తులే కాదు. నిజమైన భక్తుడు ఒక్క ఆనందాన్ని కోరాలి. ఆ ఆనందములోనే సర్వమూ మనకు లభ్యమవుతుంది. అందుకోసమనే భగవంతుని నిత్యానందం పరమసుఖదం, కేవలం జ్ఞానమూర్తిం. ఈ సుఖమూ, జ్ఞానమంతా ఆనందమువల్లనే లభ్యమవుతుంది. కనుక మానవుడు భగవంతుణ్ణి ప్రార్థించేది దేని నిమిత్తము. శాంతి, ఆనందము కొరకు.

ప్రేమస్వరూపులారా! ప్రతి విషయమునందు మనం విచారణ చేసినప్పుడు దైవమనేటువంటివాడు మనకంటే ప్రత్యేకంగా లేడు. మంచి, చెడ్డలన్నీ మనయొక్క కర్మఫలితమే కాని భగవంతునియొక్క అనుగ్రహము కాదు. ఏ విత్తనము నాటుకొందుమో ఆ మొక్కనే వస్తుంది. కనుక మన ఫలితము మంచిది కానీ, చెడ్డది కానీ ఇది భగవంతునియొక్క అనుగ్రహము కాదు. మనయొక్క కర్మఫలములే. ఇట్టి సత్యాన్ని మానవుడు గుర్తించినప్పుడే దివ్యత్వమనేటువంటి ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోగలడు. మానవుడు అనాది కాలమునుండి అనేక విధములైనటువంటి సాధనలు సలుపుతూ వస్తున్నాడు. ఎన్ని సాధనలు చేసినప్పటికినీ, ఎన్ని ఉపన్యాసములు విన్నప్పటికినీ, ఎన్ని గ్రంథములు చదివినప్పటికినీ, మన దృష్టి సరియైనటువంటిదిగా లేనప్పుడు సర్వమూ వ్యర్థమే అయిపోతుంది. అందువలనే బుద్ధుడు 'సమ్యక్‌దృష్టి' అని మొట్టమొదట ఉచ్చరించాడు. ప్రతి మానవుడు మొట్టమొదట గుర్తించవలసినటువంటిది దృష్టి. ఆ దృష్టియే సృష్టి. ఈ సృష్టి దృష్టినుంచి వచ్చినటువంటిదే కానీ సృష్టి ప్రత్యేకమైనటువంటిది కాదు. మనయొక్క దృష్టి ఎలాంటిదో అలాంటి సృష్టి ప్రారంభమవుతుంది. కడకు బుద్ధుడు చాలా విచారణ చేస్తూ వచ్చాడు. ఇంతకాలము నేను సాధనచేసి, ఇన్ని విధములైనటువంటి విచారణలు సలిపి, కట్టకడపటికి నేనేమి సాధించాను? ఏమీ సాధించలేదు.

**మనస్సును మార్చుకోవాలి**

సాధనలు అన్నిటికీ నా మనస్సే అడ్డు తగులుతూ ఉన్నాది. సర్వ విధములైనటువంటి సాధనలకు మనస్సేఅడ్డు తగులుతుంది. కనుక మనస్సును మార్చేటువంటి మార్గాన్ని నేను కనిపెట్టాలి! అని సాధన చేస్తూ వచ్చాడు. అప్పుడే అమనస్కుడైపోయాడు, ఈ అమనస్కుడు

sri sathyasaivacharamrutam

కావటం చేతనే ఆత్మ తత్త్వము తనకు లభ్యమయింది. మనస్సును మరిచి పోవటమే మనము చేయవలసిన సాధన. కానీ మనస్సును ఏ రీతిగ మరుస్తారు? ప్రాకృతమైన, లౌకికమైన, భౌతికమైన విషయాలపైన మనస్సును ఇమిడ్చి, ఈ మనస్సును ఏ రీతిగా మరవడానికి వీలవుతుంది? మనస్సును మరవడమంటే చాలా సులభమైన మార్గమే. ఏ విధంగా? మనస్సనే సంకల్పము లేకుండా, బుద్ధియొక్క ప్రభావాన్ని మనము చింతిస్తూ రావాలి. ఈ బుద్ధియొక్క ప్రభావాన్ని మనము చింతిస్తూ వచ్చేటప్పటికి ఉత్తమమైనటువంటి భావము మనలో ప్రవేశిస్తుంది. మానవునియందు నాలుగు విధములైనటువంటి జ్ఞానములుంటున్నవి. కానీ ఈనాటి యుగమునందు, ఉన్నదంతా కూడను bookish knowledge యే, అది కేవలము ఒక superficial knowledge. దాని తరువాత general knowledge కావాలి. ఈ general knowledge అనేటువంటి ఒక ఆత్మవిశ్వాసముతోనే మనకు సరియైనటువంటి జ్ఞానము లభ్యమవుతుంది. ఈ self-confidence లేకపోవడం చేత ఈ knowledge తప్పు మార్గాన్ని ప్రవేశపెడుతుంది. తదుపరియే discrimination knowledge వస్తుంది. ఈ discrimination knowledge లోపలనే ఈనాటి భక్తులందరూ మోసపోతున్నారు. తనకు అవసరమైనటువంటిది, తనకు అనుకూలమైనటువంటి రీతిగా discrimination చేస్తున్నారు. తన లక్ష్యము నిమిత్తమై, తన స్వార్థంనిమిత్తమై తన స్వప్రయోజన నిమిత్తమై discrimination చేస్తున్నారు. ఇది narrow discrimination. కానీ fundamental discrimination చెయ్యాలి. జగత్తుకు, సమాజమునకు, నాకు, సర్వులకు కూడను అనుకూలమైనటువంటి discrimination చెయ్యాలి. అదియే నిజమైనటువంటి broad mind, expansion love. తన నిమిత్తమై తాను చేసేటువంటి discrimination అంతా కూడను contraction love. కనుక love యొక్క సత్యాన్ని మనము చక్కగా గుర్తించడానికి ప్రయత్నించాలి. ఏవర్నైనా మనము పిలిచినప్పుడు హలో, హలో, హలో అంటాము. ఇది లవ్వా? కాదు! హలో అన్నంత మాత్రమున ఇది ఒక ప్రేమ కాదు. లోపల హోలో కావాలి. ఎట్టి భావములు, ఎట్టి యోచనలు, ఎట్టి కోరికలు లేకుండా నిల్చాలి. అప్పుడే మనస్సుయొక్క ప్రభావము మనలో ఏమాత్రమూ పని చెయ్యదు. బుద్ధుడు ఆరు సంవత్సరములు కృషి చేసినప్పటికినీ

sri sathyasai vachanamrutam

కట్టకడపటికి తెలుసుకున్నది యిదియే. మనస్సును ఆధారము చేసుకొని తిరిగినంత కాలము నాకు ఏమాత్రమూ ఆత్మతత్త్వము అర్థము కాలేదు. మనస్సును ప్రక్కకు నెట్టి, బుద్ధిని ఆదర్శంగా తీసుకొని, ఆత్మతత్త్వాన్ని పొందటం చేతనే 'బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్' అన్నారు. ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోవాలంటే మొట్టమొదట మనము సరియైనటువంటి మాతృభావాన్ని, ఒక విధమైనటువంటి మనో భావాన్ని దూరం చెయ్యాలి. ఈ మనస్సు ప్రభావం ఉండినంత వరకూ మనిషి ఏమాత్రము బాగుపడడు. ఎన్ని జన్మలెత్తినప్పటికినీ, ఆ మనిషి మనిషిగానే ఉంటుంటాడు. 'మనిషి!' ఈనాటి మనిషి ఏరీతిగా ఉన్నాడు? 'మ', 'ని', 'షి'. ఈ వైపునుంచి చూస్తే సినిమా. ఈనాటి మనిషి సినిమా మనిషి మాదిరిగా వున్నాడు. కేవలము నటిస్తున్నట్టుగా కనిపిస్తుండాది కానీ, హృదయపూర్వకంగా తాను ఆశించినట్టుగా కనబడటం లేదు. మానవ 'మా' అనగా ఏమిటి? అజ్ఞానము. 'న' అనగా ఏమిటి? లేకుండా. 'వ' అనగా ఏమిటి? వర్తించటము. అనగా ఏమిటి? 'మా' అనగా మాయ లేకుండా వర్తించినటువంటివాడు నిజమైన మనిషి. ఇది కేవలము illusion అంటున్నాము. మాయ అంటున్నాము. మాయ అనగా ఏమి? మాయ అనగా ఏమీ లేనటువంటిది. 'నా మాయ ఇతి మాయః' అన్నారు. లేనటువంటి దాన్ని మాయగా మనము భ్రమిస్తున్నాము. నీవేదైనా ఒక మార్గములో ప్రయాణం చేస్తున్నప్పుడు, నీవెంట నీయొక్క ప్రతిబింబము వస్తూనే ఉంటాది. ఈ ప్రతిబింబమునే 'మాయ' అన్నారు. ఈ మాయను, ప్రతిబింబాన్ని వదలిపెట్టి మనిషి నడవడానికి వీలుకాదు. Action-reaction, sound-resound. ఇదంతా మనయొక్క స్వరూపమే, మనయొక్క భావములే, మనయొక్క సంకల్పములే! అన్నీ మనలో నుంచి ఆవిర్భవించినటువంటివే. కనుక ఈ సంకల్ప, వికల్పములుండినంతవరకు మానవునియొక్క తత్త్వము మానవునికి అర్థంకాదు. అదే మొన్న చెప్పాను. మానవుని ఇంగ్లీషులో MAN అంటారు. 'M' అనగా ఏమిటి? అదే మాయ. అనగా ఇది ఒక ప్రతిబింబము అనేటువంటి సత్యాన్ని గుర్తించాలి. 'A' ఆత్మతత్త్వాన్ని అనుభవించాలి. 'N' అనేటువంటి నిర్వాణాన్ని ఏ రీతిగా మనకు లభ్యమవుతుంది? ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నప్పుడే నిర్వాణం మనలో ప్రాప్తిస్తుంది. కనుక మొట్టమొదట మనము ఆత్మతత్త్వాన్ని విశ్వాసంగా తీసుకోవాలి. ఆత్మ విశ్వాసముండినంత వరకు కూడ మనకెట్టి

sri sathyasai vahini

భయము లేదు. ఈనాటి మానవుడు సుఖముతో, దుఃఖముతో, ఎన్నో విధములైనటువంటి కష్టములతో కృంగి, కుశించి పోతున్నాడు మానవుడు. ఈ ప్రపంచ సంబంధమైనటువంటి విషయవాసనలపైన ఎంత అభిరుచి ఉన్నదో, దాంట్లో ఒక్క భాగమైన దైవంపై విశ్వాసం పైన లేదు.

**యాచింతా భువి పుత్రమిత్ర భరణే వ్యాపార సంభాషణే**
**యాచింతా ధన ధాన్య భోగ యశసాం లాభే సదా జాయతే**
**సాచింతా భువి నంద నందన పద ద్వంద్వారవిందే క్షణే**

దాంట్లో వెయ్యింట ఒక భాగమైన కూడను భగవంతుడి పాదములపై మనస్సు పెట్టటము ఎంతో అదృష్టము! ధన దాన్య భోగ యశస్సు కోసం ఎంత నీవు పరితపిస్తున్నావో, దాంట్లో ఒక క్షణ భాగము భగవంతుని విశ్వాసము పైన పెట్టకూడదా! ఏ మాత్రమూ లేదు. ఈ అనిత్యమైనటువంటి దానిపైన సర్వమునూ, ప్రాణమునూ అర్పితము చేస్తున్నాడు మానవుడు. అర్పితము చేసి ప్రయోజనమేమిటి? అనుభవించేది ఏమిటి? మనము అర్పితము చేసేది, భగవత్ విశ్వాసానికి అర్పితము చేయాలి. అప్పుడే సర్వవిధములైనటువంటి శాంతిని, లోకశాంతిని, మనశ్శాంతిని పొందుతాము, అన్ని విధములైనటువంటి శాంతులు మనకు లభ్యమవుతాయి.

**సమాజ శ్రేయస్సే ప్రధాన లక్ష్యం**

వ్యక్తిగతంగా, కుటుంబంగా, సమాజికంగా ఎన్నో విధములైన శాంతులకు మనము అనుభవించవచ్చును. మనము సమాజమును లక్ష్యములో పెట్టుకోవాలి. సమాజము లేకపోతే మనము లేము. మన కుటుంబము లేదు. కనుక మొట్టమొదట సమాజము, సమాజము నుంచి నేను పుట్టాను. నేను సమాజములో సభ్యుడిని. ఈ సత్యాన్ని గుర్తించుకొని సమాజ క్షేమాన్ని ఆశిస్తూ రావాలి. కేవలము నీ ఆనందాన్నే లక్ష్యములో ఉంచుకోకూడదు. దీనిని పురస్కరించుకునే 'లోకాః సమస్తా సుఖినో భవంతు'. ప్రాచీనకాలమునుండి పవిత్ర భారతీయ సంస్కృతి, ఆద్యాత్మిక తత్త్వము విచారణ చేత యావత్ ప్రపంచమునకు సృష్టికి శాంతి భద్రతలు అందిస్తూ వచ్చాయి. అన్ని దేశములకుకూడను శాంతి భద్రతలు

srisathyasaivachanamrutam

అందించేది భారతదేశమే. ఇది భారతదేశము. అందరూ భారతీయులే. భారతీయులు అనగా ఏమి అర్థము? భా-స్వప్రకాశము అయినట్టిది జ్యోతి. ఆ జ్యోతిని మనము మరచటమే భ్రాంతి. ఇటువంటి జ్యోతిర్మయమైనట్టి దైవత్వాన్ని మనము వరించినప్పుడే భారత అనే పేరు సార్థకము అవుతుంది. సంగీత, సాహిత్య విద్యలందు కూడను ఈ భారతి అనేకత్వమును ఇమిడ్చి ఉంటున్నది. భారత అంటే ఏమిటి. భా-భావము, ర-రాగము, త-తాళము. భావరాగతాళ సమేతమైనది భారతము. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, అన్ని రంగములయందు కూడను భారతి అనేటి సత్యాన్ని మనము గుర్తించాలి. బారతదేశమునందు పుట్టి, భారతము అనగా ఏదో రామునియొక్క తమ్ముడు అనుకుంటున్నారు. కాదు కాదు. ఇది అన్నింటికి అతీతమైనట్టిది. అతి పవిత్రమైన భారతతత్త్వాన్ని మనము గుర్తించాలి. దైవభావము అనేది మనకు ఆవిర్భవిస్తుంది.

ప్రేమస్వరూపులారా! భగవంతుడు ప్రేమస్వరూపుడు. భగవంతుడు సత్యస్వరూపుడు. భగవంతుడు శాంతిస్వరూపుడు. భగవంతుడు ఆనందమయుడు. ఇట్టి ఆనందమైనట్టి భగవంతుడిని మనము ఆనందముతోనే ప్రార్థించాలి. ఇట్టి భగవంతునకు సత్, చిత్, ఆనందము అనేది సార్థక నామము. సత్ అనగా ఏమిటి? శాశ్వతము. శాశ్వతమైన భావముచేత శాశ్వతమైన భగవంతుని మనము ప్రార్థించాలి. చిత్ అనగా ఏమిటి? జ్ఞానమయము అయినట్టిది. ఈ జ్ఞానము ఎట్లా ఉండాలి. ఆధ్యాత్మికముగా ఆవిర్భవించాలి. సత్‌ను సత్‌తోనే పొందాలి. చిత్‌ను చిత్‌తోనే పొందాలి. ఆనందమును ఆనందముతోనే పొందాలి. కొంత నిరాశతో, నిస్పృహతో, నిరాపేక్షతో ఏమాత్రము అలక్ష్యం చేయకూడదు. కనుక భగవంతునియొక్క తత్త్వాన్ని మొట్టమొదట గుర్తించటానికి, తగినట్టి సత్యము ప్రేమనే. ప్రేమతో మనము భగవంతుని ఆరాధించినప్పుడు తాను ప్రేమనే అందిస్తుంటాడు. 'యద్భావం తద్భవతి' మానవుడు తన భావాన్ని పురస్కరించుకొని తగిన ఫలితాన్ని పొందుతుంటాడు. ఈనాటి మానవునియందు ప్రేమ వేరు భావము వేరుగా ఉంటున్నాది. నిన్న పిల్లలకు సాయంకాల సమయంలో చిన్నదిగా బోధించాను. పిండిమిల్లు ఉంటున్నాది. ఈ పిండిమిల్లులోపల గోదుమలు వేసినప్పుడు గోదుమపిండి వస్తున్నాది. బియ్యం వేసినప్పుడు బియ్యంపిండి వస్తున్నాది. కాని ఈ మానవుడు అనే పిండిమిల్లులోపల

sri sathyasai vahamrutam

ఫలము వేస్తే మలంగా బయటకు వస్తుంది. ఆ పిండిమిల్లు మేలుకదా. ప్రాణమున్న ఈ దేహములో, ఒకటి వేస్తే వేరొకటి వస్తున్నాది. మనము ఆవకాయలు ఏమైనా వడ్డించుకుని తింటే సాయంకాలమునకు జీర్ణము అయిపోతుంది. అదే ఆవకాయలు జాడీలో పెట్టితే ఒక సంవత్సరమువరకు చెడిపోకుండా ఉంటుంది. ఈ జాడీకంటే ఆ జాడి ఎంతో మేలుకదా.

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!**

ఏది మన ఈ దేహము. ఈ దేహము మనము కాదు.

**మలినపు కొంప రోగముల ప్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

నేను అన్నియు చదువుకున్నవాడిని, అన్ని గ్రంథములు తెలిసినట్టివాడిని అని భావిస్తూ వుంటాడు పండితుడు.

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగజూచితి సర్వ శాస్త్రముల్**

sri sathyasai vachanamrutam

నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె చూడ మానవా!
నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవింద దళాయతాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

ఏమిటి మనము సాధించవలసినది. ఇన్ని రకములైన శ్రమలకు నోచుకుంటున్నాము. కానీ భగవంతునియొక్క దర్శన శ్రమకు ఏమాత్రము మనము నోచుకోలేము. ఒక సినిమా దగ్గరైన క్యూలైనులో నించుని కావలసిన కాలాన్ని తీసుకుంటాము, బస్‌స్టాండులోపల సీటు కోసము ఎంతో కాలము క్యూలైనులో నించుని మనము శ్రమ పడుతాము. భగవంతుని కోసం ఒక్క క్షణమైనా యోచన చెయ్యటానికి టైములేదు. ఇంక ఏమిటి నువ్వు సాధించేది. ఇష్టమైన దానికోసం ప్రయత్నిస్తున్నావు. దీని కోసం కాదు వెయిట్ చేయవలసింది. భగవంతుని అనుగ్రహంకోసం మనము వెయిట్ చెయ్యాలి. భగవంతుని ఆనందముకోసం మనము వెయిట్ చెయ్యాలి. అప్పుడే నిజమైన జీవితము, జీవితమంటే కేవలము దేహాన్ని పెంచుకోవటము, భోజనము తింటము, హాయిగా జీవితాన్ని గడపటము కాదు. Body is the Temple of GOD. దేహాన్ని రక్షించుకో తప్పులేదు కానీ దేనికోసం? ఒక వృక్షము ఫలములంతా యిస్తున్నాది. కావలసినన్ని ఫలములు పుడుతున్నాయి. కానీ ఆ ఫలములు నావికదా అని ఆ చెట్టు ఒక ఫలాన్ని భుజిస్తుందా. నది ప్రవహిస్తున్నాది. మరి యింత నీరు ఉంటున్నాది అని ఆ నది కొంచమైనా నీరు త్రాగుతుందా. ఒక గోవు, తనలో క్షీరము ఉంది కదా అని ఒక చిటుకుడైనా త్రాగుతుందా లేదు ఇతరులకు పంచుతుంది. కానీ మానవుడు ఏమి పంచుతున్నాడు. ఏమి త్యాగము చేస్తున్నాడు? ఏమి సమాజమునకు సహాయము చేస్తున్నాడు. ఏమీ లేదు. నిరంతరము తాను తాను తాను తాను. ఈ స్వార్థాన్ని ఎప్పుడు మానవుడు త్యాగము చేస్తాడో ఆనాడే తాను ఆ దైవానుగ్రహానికి గురౌతాడు. 'లోకాః సమస్తాః సుఖినో భవంతు'. లోకమంతా మంచిగా ఉండాలి. లోకక్షేమాన్ని కోరినప్పుడు

srisathyasaivachanamrutam

లోకము మన క్షేమాన్ని ఎందుకు కోరదు. 'ధర్మో రక్షతి రక్షతః' ధర్మాన్ని మనము రక్షించినప్పుడు, ధర్మము మనల్ని రక్షిస్తుంది. 'ధర్మఏవ హతోహంతి' దానిని మనము చంపినప్పుడు అది కూడా మనల్ని చంపుతుంది.

**లభించిన మానవత్వాన్ని సార్థకం చేసుకోవాలి**

ప్రేమస్వరూపులారా! మానవత్వము ఎంతో అదృష్టవశాత్తు మనకు లభ్యమైనది. ఇట్టి అదృష్టం వంటి ఈ మానవ జన్మ సార్థకము చేసుకోవటానికి మనము ప్రయత్నం చేయాలి. అంతేగాని, ప్రాకృతమైన సుఖసంతోషములకొరకు పాటు పడకూడదు. ఇవన్నీ క్షణభంగురమైనవి. కనుక ఎంతకాలము బ్రతికినప్పటికీ, ఇవన్నీ క్షణభంగురములే. కనుకనే, భగవంతుని భజించాలి. ఎంతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించిన శంకరాచార్యులు కట్టకడపటికి భక్తిలో ప్రవేశించారు.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**
**ఇహసంసారే బహుదుస్తారే కృపయా పారే పాహి మురారే**
**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి డుకృఞ్ కరణే.**

శంకరాచార్యుల అద్వైతము, చాలా పవిత్రమైన అద్వైతము. కానీ అద్వైతములో భక్తికి ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ భక్తి అనేటువంటిది ప్రతీ మానవునికి అత్యవసరమైనటువంటిది. భక్తి అనగా కేవలము ఒక విధమైన ఆచారముతో కాదు. ఆనందముతో ఆచరించి, ఆనందించి అనుభవించుటానికి తగిన ప్రేమ తత్వముండాలి. ఈ ప్రేమతత్వము లేనటువంటి మానవుడు ఎన్ని చేసియు ప్రయోజనము లేదు. కనుక ప్రేమచేతనే మనము అద్వైత జ్ఞానాన్ని పొందాలి.

**(తేదీ 20-04-1998న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam